క్లుప్తంగా

భూములకు మార్కెట్ ధర చెల్లించాలి

మెట్‌పల్లిరూరల్: జాతీయ రహదారి విస్తరణ(ఎన్‌హెచ్‌-63) లో భూములు కోల్పోతున్న తమకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో విలువైన భూములకు మార్కెట్ ధర ప్రకారం కాకుండా,పరిహారం తక్కువ చెల్లిస్తే సహించేదిలేదని, రైతులమంతా కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, చిన్న గంగారెడ్డి, రవి, నర్సారెడ్డి, గంగారెడ్డి,శ్రీనివాస్,చిట్టి,ప్రవీణ్, కిషన్, నరేశ్,రాజారెడ్డి పాల్గొన్నారు.

టౌన్‌షిప్ బ్రోచర్లు ఆవిష్కరణ

ధర్మపురి: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రకృతి టౌన్‌షిప్ బ్రోచర్లను ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా చక్కటి సౌకర్యాలతో ప్రకృతి టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టడంపై యాజమాన్యాన్ని అభినందించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దినేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మేడిపల్లి: భీమారం మండలం కమ్మర్ పేటలో మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై వాటి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎవరైనా అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే అయితే ఓటీపీ గురించి అడిగితే వెంటనే అప్రమత్తం అవ్వాలని, లింక్‌లు పంపితే ఓపెన్ చేయొద్దని ఏదైన సమస్య కలిగితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే మోసం జరిగిన వెంటనే 1930 కి కాల్ చేసి సమాచారం తెలియజేయాలని అన్నారు.

ఆరోగ్యానికి నడక అత్యంత ముఖ్యం



పోటీల్లో పాల్గొన్న కమిషనర్ సమ్మయ్య

జగిత్యాల: మనిషి ఆరోగ్యానికి నడకతోపాటు, పరుగెత్తడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 21కె రన్‌లో 2.గంటల15 నిముషాల్లో చేరుకుని అవార్డు సాధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రన్నింగ్‌లో పాల్గొనాలని సూచించారు.

జగిత్యాల క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో నిర్వాహకులు

జగిత్యాల: జగిత్యాల క్రీడాకారులు ఆదివారం కరీంనగర్‌లో జరిగిన స్టేట్ లెవల్ కుంగుఫూ కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆర్.వెంకటేశ్వర్లు క్రీడాకారులను అభినందించారు.

విద్యార్థులకు సన్మానం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని ఆలీ ఫౌండేషన్ కోరుట్ల ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం, ప్రశంసాపత్రాలను ఆదివారం అందజేశారు. 2024లో ఉత్తమ ఫలితాలు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు సన్మానం, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ మసూద్ అలీ, అక్బర్, ఛీఫ్ ప్యాట్రన్ ఎండీ ఇక్బాల్ అలీ, ప్రదాన కార్యదర్శి యూసుఫ్ ఆలీ, డిప్యూటీ తహసీల్దార్ ఖదీర్, స్థానిక కౌన్సిలర్ ముజాఫర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల పునర్విభజన ఎప్పుడో?

- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు
- గ్రామాలకు అనుకూలంగా సంఘాలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు
- మండలంలో మరో రెండు సంఘాలు అవసరం



భూషణరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

కథలాపూర్: చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్నట్లుగా..రైతన్నకు వెన్నుదన్నుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) సేవలు విస్తృతం చేయడానికి గ్రామాలకు అనుకూలంగా సంఘాలను ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయా సంఘాల పరిధి ఎక్కువగా ఉండటం, గ్రామాలకు దూరంగా సంఘాలు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఓ సంఘం పరిధిలో రెండు గ్రామాలు ఉండగా, మరికొన్ని సహకార సంఘాల పరిధిలో గ్రామాలు ఎక్కువగా, దూరంగా ఉండటంతో భారంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తూ అండగా నిలిచే సహకార సంఘాల విస్తరణ గురించి ప్రభుత్వం పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూడు సొసైటీలు.. 4,407 మంది సభ్యులు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా సిరికొండ, గంభీర్‌పూర్, భూషణరావుపేట గ్రామాల్లో సహకార సంఘాలున్నాయి. మూడు సంఘాల్లో కలిపి 4,407 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులు ప్రతి పంట సీజన్‌లో రుణాలు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. కొందరు కొత్తగా రుణాలు తీసుకుంటారు. వీటి కోసం దూరంలో ఉన్న సొసైటీలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సిరికొండ సొసైటీ పరిధిలో సిరికొండ, తక్కళ్లపెల్లి గ్రామాలున్నాయి. గంభీర్‌పూర్ సొసైటీ పరిధిలో గంభీర్‌పూర్, బొమ్మెన, తుర్తి, తాండ్య్రాల గ్రామాలున్నాయి. భూషణరావుపేట సొసైటీ పరిధిలో 13 గ్రామాలున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న భూషణరావుపేట సొసైటీకి వివిధ పనులకు రైతులు వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పంట రుణాలు, వ్యాపార రుణాల కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి సమయంలో సొసైటీకి రావడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

విభజిస్తేనే రైతులకు ప్రయోజనం...

వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే సహకార సంఘాల సేవలు అందుబాటులోకి రావాలంటే వాటిని విభజించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం 5వేల ఎకరాలకు ఒక వ్యవసాయ శాఖ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించిందని, అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలంటున్నారు. ఒక్కో సొసైటీలో ఎక్కువ మంది రైతులు సభ్యత్వం కలిగి యుండగా.. ఏ అవసరం వచ్చిన క్యూ కట్టాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ప్రతి పంటల సీజన్ ఆరంభంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు బారులు తీరిన సందర్భాలున్నాయి. పాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన చేసినట్లుగానే రైతులకు మేలు చేకూర్చే సొసైటీల విభజనపై దృష్టిసారించాలని మండల రైతులు కోరుతున్నారు. మండలంలోని రైతుల జనాభా ఆధారంగా అంబారిపేట, కథలాపూర్ గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అంబారిపేటలో సొసైటీ అవసరం



మా ఊరిలో సహకార సంఘం లేదు. 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూషణరావుపేట సొసైటీ పరిధిలో మా గ్రామం ఉంది. వివిధ అవసరాల కోసం అక్కడకు రైతులు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. సీజన్‌లో పంట రుణాల కోసం పోతే ఒక్కరోజంతా వృథా అవుతుంది. పలు గ్రామాలకు కూడలిగా అంబారిపేట ఉంది. ఇక్కడ సొసైటీ ఏర్పాటు చేయాలి.

– చీటి విద్యాసాగర్‌రావు, రైతు నాయకుడు, అంబారిపేట

మండలకేంద్రంలో ఒకటి ఏర్పాటు చేయాలి



సహకార సంఘాలు రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పోసానిపేట, కలిగోట, పోతారం, అంబారిపేట, ఇప్పపెల్లి గ్రామాల రైతులు భూషణరావుపేట సొసైటీకి వెళ్లాలంటే రెండు బస్సులు మార్చి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. సొసైటీలు పలు గ్రామాలకు కూడలిగా ఉండేలా ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. కథలాపూర్‌లో సొసైటీ ఏర్పాటు చేయాలి.

– తాలుకా మల్లేశ్, రైతు, కథలాపూర్

నివేదిక పంపించాం



రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడమే సహకార సంఘాల లక్ష్యం. భూషణరావుపేట సహకార సంఘం సంఘం పరిధిలో 13 గ్రామాలున్నాయి. ఆ సంఘాన్ని విభజన చేయాలని ఇటీవలే పాలకవర్గసభ్యులు తీర్మానం చేశారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే నూతన సొసైటీలు ఏర్పాటు చేస్తాం.

– ఊశకోల అరుణ్, సీఈవో, పీఏసీఎస్, భూషణరావుపేట



కథలాపూర్: మండలకేంద్రంలోని రైతు వేదికకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వివిధ పనులకు రైతు వేదికకు వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు వేదిక వద్దకు పోయే రోడ్డులో నీరు ఉధృతంగా పారడం, వర్షపు నీరు నిల్వడంతో బురదమయంగా మారిందని రైతులు అంటున్నారు. అధికారులు చొరవ చూపి రైతు వేదిక వద్దకు వెళ్లే రోడ్డులో నీరు పోయే విధంగా పైపులు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

సంప్రదించాల్సిన అధికారి యోగిత, మండల వ్యవసాయ అధికారి ఫోన్ నంబర్, 7288894145

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలి



మెట్‌పల్లి బస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

- మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి: సబ్ డివిజన్‌లో గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు కోరారు. మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో జిల్లాకు గంజాయిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్‌లతో ఆర్టీసీ బస్‌స్టేషన్, పలు రద్దీ ప్రాంతాల్లో వాహనాలు, అనుమానస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. గంజాయిని అరికట్టడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎవరైనా గంజాయిని విక్రయిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. స్వీయ రక్షణకు ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన బిరుదుల గంగవ్వ భర్త కిష్టయ్య ఇటీవల మృతి చెందగా, ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన లింగంపల్లి రాజు,రంగు తిరుపతిగౌడ్ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బుర్ర ప్రవీణ్‌గౌడ్,శాంతపురావు, రవీందర్‌రావు, శేఖర్,లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మేడిపల్లి: భీమారం, మన్నెగూడెం గ్రామాలకు చెందిన లింగాల వనిత, చెన్నమనేని రవీందర్ రావు, ఆర్మూర్ లక్ష్మి, కాలాస్తం నరేశ్, మల్యాల సత్తమ్మలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, కాంగ్రెస్ పార్టీ భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గంట గంగరాజం, యువజన కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి రవి, ఆర్మూర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

పెగడపల్లి: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్సై రవికిరణ్ సిబ్బందితో కలిసి శుభ్రత పరిశుభ్రత పేరుతో ఆదివారం శ్రమదానం చేశారు. పోలీసు స్టేషన్ ఆవరణ చుట్టుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలు పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నట్లయితే మంచి ఆహ్లాదకర వాతావరణం సృష్టించుకోవడం కోసం శ్రమదానం చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్తయ్య, సిబ్బంది సంపత్, రవీందర్, ఎల్లయ్య, తిరుపతి, రాజేశ్, వెంకటేశ్, రమ, మమత పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస, జ్యోతి స్కూల్‌ల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోపిక, కృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. కార్యక్రమంలో మానస, జ్యోతి డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తలకు సన్మానం

కోరుట్ల: పట్టణంలోని కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే కార్యకర్తలను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, నయీం, బీఆర్‌ఎస్ నాయకులు ఫాహీం, నజీబొద్దీన్, ఖయ్యూం, ఒలిక్, సలీం ఫారూఖీ, ఇలియాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పతకాలు

రాయికల్: కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌లో స్టేట్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో రాయికల్‌లోని 11 మంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్లు కనుక ప్రభాకర్,ప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

మహిళకు పురుడు పోసిన మాజీ సర్పంచ్

మేడిపల్లి: భీమారం మండలంలోని రాగోజీపేటలో శనివారం అర్ధరాత్రి కల్లెం కోమలత అనే మహిళకు పురిటినొప్పిలు వచ్చాయి, రెండురోజుల క్రితం ఆస్పత్రి కి వెళ్లగా ఇంకా సమయం ఉందని చెప్పడంతో ఇంటికి వచ్చారు, సాయంత్రం ఒక్కసారిగా పురిటినొప్పులు రావటం, మరోవైపు విపరీతమైన వర్షం ఉండటంతో మాజీ సర్పంచ్ బాలసాని లహరికకు సమాచారం అందించగా వచ్చి ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డ పుట్టాడు. అంతలో అంబులెన్స్ సిబ్బంది వచ్చి తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. మహిళలకు పురుడు పోసిన లహరికను గ్రామస్తులు అభినందించారు.

27న దుబ్బరాజన్న ఆలయంలో గోపాల కాలువలు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో ఈనెల 27న మంగళవారం గోపాల కాలువల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య తెలిపారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రావణమాసం మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్టి వేడుకలు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల యువకులు ప్రతి ఏట ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కాగా 26న శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో మధ్యాహ్నం నుంచి 27 న సాయంత్రం వరకు నిరంతర భజన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నియామకం

నవదుర్గా సేవా సమితి అధ్యక్షుడిగా గంట్యాల ప్రవీణ్

రాయికల్: నవదుర్గా సేవా సమితి రాయికల్ పట్టణ అధ్యక్షుడిగా గంట్యాల ప్రవీణ్, ప్రధానకార్యదర్శిగా మోర చైతన్య,ఉపాధ్యక్షులుగా జోపువార్ మధు,శ్రీరాముల సాయికిరణ్,సంయుక్త కార్యదర్శులుగా బూర్ల గోపి,మానాల రాము, కోశాధికారిగా సంగరాము, సంయుక్త కోశాధికారులుగా అంకం శ్రీకర్,అనుమల్ల సాయి,ప్రచార కార్యదర్శి గా బొమ్మకంటి నవీన్ ఎన్నికయ్యారు.

పూసల సంఘం కార్యవర్గం

జగిత్యాల: జగిత్యాల పట్టణ పూసల సంఘం కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న కృష్ణ, ప్రధానకార్యదర్శిగా పన్నీరు జీవన్‌కుమార్, కోశాధికారిగా సుంకరి దిలీప్, ఉపాధ్యక్షుడిగా చిన్న తిరుపతి, సహయకార్యదర్శిగా వేణుగోపాల్ ఎన్నికై ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఎన్నికల అధికారిగా తిరుమలేశ్ వ్యవహరించారు.

దొంగతనాలతో అప్రమత్తంగా ఉండాలి

కొండగట్టు: దొంగతనాలపై మల్యాల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం మల్యాల ఎస్సై ఏ. నరేశ్ కుమార్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా దొంగతనాల నివారణకు ప్రతి రోజు ప్రత్యేక నిఘా ఉంటుందని, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 కు, తమకు సమాచారం అందించాలన్నారు.ఇల్లు వదిలి వెళ్లే సమయంలో ఇంటి యజమానులు, పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని సూచించారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామాల్లోని ముఖ్య కూడల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అదుపులోకి తీసుకురావచ్చన్నారు.

మతిస్థిమితం లేని యువకుడు ఆత్మహత్య

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన మారెల్లి భాస్కర్(30) అనే యువకుడు మతిస్థిమితం లేని పరిస్థితుల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. భాస్కర్ గత 10 ఏళ్లుగా మతిస్థిమితం లేక గ్రామాల్లో తిరిగేవాడు. శనివారం ఉదయం భాస్కర్ ఇంటి ఆవరణలో పురుగుల నివారణ మందు తాగాడు. చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుడి మేనమామ బాస నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి గ్రామ శివారులో ఆదివారం పేకాట స్థావరంపై ఎస్సై అనిల్ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో గ్రామశివారులోని శ్మశానవాటిక వెనుక రేకుల షెడ్‌లో పేకాట ఆడుతుండగా, ఐదుగురు వ్యక్తులను పట్టుకుని రూ.2800 నగదు, 5 సెల్‌ఫోన్లు, 4 మోటర్ సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకలు

మల్లాపూర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలను ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని బీజేపీ మండలశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. అరవింద్ ధర్మపురి యువసేన కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేగుంట శివారులోని నివేదిత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కొత్తబట్టలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యులు రాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముస్కరి రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల రక్తదానం

మెట్‌పల్లి: ఎంపీ అర్వింద్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని రాధ్యా బ్లడ్ సెంటర్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిట్నేని రఘు, నియోజకవర్గ కన్వీనర్ సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, చెట్లపల్లి మీనా, పీసు రాజేందర్, కలికోట శ్రీకాంత్, సుంకె అశోక్ తదితరులున్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 2000–01 బ్యాచ్ పూర్వ విద్యార్థి కేసరి శంకర్‌కు ఆయన మిత్రులు ఆదివారం రూ. 47వేల ఆర్థికసాయం అందించారు. కేసరి శంకర్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి, డాక్టర్లు 5 నెలలు బెడ్ రెస్ట్ తీసుకోమ్మన్నారు. శంకర్ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న స్నేహితులు ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు.

కోరుట్లలో బీజేపీ సభ్యత్వ సమోదు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

కోరుట్ల: పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ,నాయకులు బోగ శ్రావణి, రఘు, సుఖేందర్ గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

29న మెట్‌పల్లిలో రైతుల మహాధర్నా

మెట్‌పల్లి: ఈ నెల 29న పట్టణంలో రైతుల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మామిడి నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీని వర్తింపజేయాలని, వరికి రూ.500 బోనస్ చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.7500 ఇవ్వాలనే డిమాండ్‌తో కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ధర్నాకు మెట్‌పల్లి డివిజన్‌కు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రంగారావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో వివిధ సంవత్సరాల్లో ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులంతా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థి దశలో ఉన్న వారంతో ఈరోజు గుర్తు పట్టలేనంత స్థాయికి ఎదిగిపోయారు. చిన్ననాటి చిలిపి చేష్టలు, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.తమకు చదువు చెప్పిన గురువు రంగారావ్‌కు పాదాభివందనం చేశారు. అప్పటి ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ డీఆర్‌కె. రంగారావ్‌ను కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు రాం సుధాకర్, రేణుకా శ్రీదేవి, పూర్వ విద్యార్థులున్నారు.